క్లుప్తంగా

మహిళా సంఘాల పురోగతికి పాటుపడాలి



దేవరుప్పుల : మహిళా సాధికారతకు విరివిగా ఇచ్చిన రుణాల చెల్లింపు ప్రక్రియ సజావుగా కొనసాగిస్తూ సంఘాల పురోగతికి పాటుపడాలని డీఆర్‌డీఓ ఏపీడీ నూరొద్దీన్ అన్నారు. శనివారం మండల పరిషత్‌లో ఐకేపీ స్త్రీనిధి, ఇతర రుణాల ప్రక్రియపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో గ్రామాల్లో మహిళలకు ఇచ్చిన రుణాలు.. స్వయం ఉపాధి పథకాల పురోగతిపై చర్చించారు. ఎంపీపీ బస్వ సావిత్రి, ఐకేపీ ఆర్‌ఎం నిర్మల, ఏపీఎం వెంకట్‌రెడ్డి, చందన సమాఖ్య అధ్యక్షురాలు ఉమ పాల్గొన్నారు.

ప్రసాద్‌శర్మకు విశిష్ట పురస్కారం



దేవరుప్పుల: జ్యోతిష్యం పురోగతికి పాటుపడుతున్న స్థానిక శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ విశిష్ట పూజారి బ్రహ్మశ్రీ అవసరాల ప్రసాద్‌శర్మ సిద్ధాంతికి పరాశర అకాడమీ ఆస్ట్రో సైన్స్ ఆధ్వర్యంలో మంత్ర శాస్త్ర విభూషణ బిరుదు ప్రదానం చేశారు. శనివారం హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రం దొడ్డి కొమురయ్య హాల్‌లో శ్రీ శంకరమంచి దర్శనశర్మ, ఫణి శశాంకశర్మ, మహేశ్చంద్ర భరద్వాజ్ పురస్కారం అందజేశారు.

మైనార్టీ గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

జనగామ రూరల్: జిల్లాలోని మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలలో 2023–24 విద్యాసంవత్సరం ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ శివలింగయ్య, జిల్లా అధికారి ఇస్మాయిల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా ఈనెల 15 నుంచి 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని, గ్రామీణ ప్రాంతం వారైతే రూ.1.5 లక్షలు, పట్టణం వారికి రూ.2లక్షల వార్షిక ఆదాయం మించకూడదని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9963397958, 9951933034, 7569570837, 9441903130, 9959027152 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మొక్కలను రక్షించాలి

బచ్చన్నపేట: వన నర్సరీల్లో ఉన్న మొక్కలను వంద శాతం రక్షించాలని ఎంపీడీఓ రఘురామకృష్ణ అన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించి పల్లెప్రగతి పనులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. జీపీ కార్యదర్శులు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

హైఓల్టేజీతో కాలిపోయిన ఎలక్ట్రానిక్ పరికరాలు

జనగామ: జనగామ పట్టణం వీవర్స్ కాలనీలో విద్యుత్ హైఓల్టేజీతో ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోయిన సంఘటన శనివారం రాత్రి జరిగింది. కాలనీకి చెందిన బాధితులు ఎనగందుల లాస్య, రాపోలు పద్మ, ఎనగందుల ప్రమీల, గట్టు వినోద మరికొంత మందికి చెందిన టీవీలు, బ్లౌజ్ డిజైనింగ్, లేడీస్ టైలరింగ్ మిషన్లు, నేత కార్మికుల ఆశు యంత్రం కాలిపోగా, విద్యుత్ బల్బులు ఊడి కింద పడిపోయాయి. వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం అందించడంతో మరమ్మతు చర్యలు చేపట్టారు. ఈ విషయమై పట్టణ ఎన్‌పీడీసీఎల్ ఏఈ మధును వివరణ కోరగా.. వందకు పైగా కోతులు చెట్లపై నుంచి ఎల్‌టీ లైన్‌పై దూకడంతో ఫేస్‌టూ ఫేస్ జరిగి, విద్యుత్ హైఓల్టేజీ వచ్చిందన్నారు. దీంతో ఇళ్లలో ఎలక్ట్రానిక్ పరికరాలతో పాటు ట్రాన్స్‌ఫార్మర్ బుష్‌రాడ్ సైతం వేడికి కరిగి పోయిందన్నారు. కోతులకు మాత్రం ఎటువంటి ప్రమాదం జరగలేదన్నారు.

కేసు నమోదు

స్టేషన్‌ఘన్‌పూర్: కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.సంతోష్ విధులకు ఆటంకం కలిగించిన రేపాకుల శ్రీనివాస్, నేర్ల సురేందర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ రాఘవేందర్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సంతోష్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఘన్‌పూర్–జనగామ జాతీయ రహదారిలో మండలంలోని రాఘవాపూర్ దగ్గరలో శనివారం స్పీడ్ లేజర్ గన్ డ్యూటీ చేస్తున్నాడు. ఈ క్రమంలో భూపాలపల్లి చెల్పూరుకు చెందిన శ్రీనివాస్, నడిగూడెం మండలానికి చెందిన సురేందర్ కారులో హైదరాబాద్‌కు వెళ్తున్నారు. ఇద్దరు జెన్‌కోలో ఉద్యోగులు. కాగా, ఈ క్రమంలో కానిస్టేబుల్ స్పీడ్ గన్ ద్వారా స్పీడ్ ఎక్కువగా ఉన్న వెహికిల్స్‌ను గుర్తిస్తుండగా కారులో ఉన్న ఇద్దరు వాహనాన్ని ఆపి కానిస్టేబుల్‌ను దూషించారు. రోడ్డుపై వెళ్తున్న వాహనాలను ఆపి కానిస్టేబుల్ విధులకు ఆటంకం కలిగించారు. కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఎవరైనా పోలీసుల విధులకు ఆటంకం కలిగిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

ప్రయాణం.. ప్రాణసంకటం

- అధ్వానంగా పడమటిగూడెం మట్టి రోడ్లు
- బీటీ రోడ్లు వేయాలంటున్న స్థానికులు

రఘునాథపల్లి: మండలంలోని పడమటిగూడెం గ్రామ రోడ్లు అధ్వానంగా మారాయి. నిడిగొండ మీదుగా మండల కేంద్రానికి వెళ్లే మట్టి రోడ్డుపై కంప చెట్లు, బురద గుంతలతో బైకులు, సైకిళ్లు కూడా వెళ్ల లేని స్థితికి చేరుకున్నాయి. ఇక జిల్లా కేంద్రానికి యశ్వంతాపూర్ క్రీస్తుజ్యోతి కళాశాల మీదుగా గుంతలమయమైన మట్టి రోడ్డుపై ప్రయాణం ప్రాణసంకటంగా మారినా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదు. పడమటిగూడెంతో పాటు తూర్పుగూడెం గ్రామాల నుంచి నిత్యం జనగామ, రఘునాథపల్లికి రైతులు, గ్రామస్తులు రాకపోకలు సాగిస్తూ అవస్థలు పడుతున్నారు. రేషన్ సరుకులు తెచ్చుకునేందుకు నిడిగొండకు వెళ్లేందుకు నానా అవస్థలు పడుతున్నారు. వర్షం పడితే రోడ్లు మరింత పాడవుతుండటంతో అడుగు తీసి అడుగు వేయాలంటే నరకం అనుభిస్తున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే సొంత డబ్బులతో మట్టి రోడ్లు బాగు చేసుకున్నా.. కొన్ని రోజులకే ధ్వంసమవుతున్నాయని ఆవేదన చెందుతున్నారు. నూతన బీటీ రోడ్లు నిర్మించాలని పాలకులు, అధికారులకు పలు మార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. పడమటిగూడెం నుంచి జనగామకు వెళ్లేందుకు క్రీస్తుజ్యోతి కళాశాల వరకు 3 కిలోమీటర్ల బీటీ, రఘునాథపల్లికివెళ్లేందుకు నిడిగొండ వరకు మరో 3 కిలోమీటర్ల దూరం బీటీ వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ఇచ్చిన హామీ మేరకు బీటీ రోడ్డు వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



గుంతలమయంగా పడమటిగూడెం రోడ్డు

ఉన్నతాధికారులు పట్టించుకోవాలి..



గ్రామం నుంచి రఘునాథపల్లి, జనగామ వెళ్లేందుకు బీటీ రోడ్డు లేక నిత్యం రైతులం ఇబ్బందులు పడుతున్నాం. మట్టి రోడ్లపై గుంతలు ఏర్పడి కంపచెట్లు పెరిగి అవస్థలు ఎదుర్కొంటున్నాం. రేషన్ కోసం నిడిగొండకు వెళ్లాలంటే సైకిళ్లు కూడా నడవ లేని స్థితికి చేరుకుంది. ఉన్నతాధికారులు స్పందించి గ్రామం నుంచి నిడిగొండ, క్రీస్తుజ్యోతి కళాశాల వరకు రెండు వైపులా బీటీ రోడ్లు వేయాలి.

- చిల్కల తిరుపతిరెడ్డి, పడమటిగూడెం

ఎమ్మెల్యే, ఎంపీ దృష్టికి తీసుకెళ్లా..



గ్రామం నుంచి మండల కేంద్రానికి, జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు గుంతల రోడ్లపై ప్రయాణం చేయలేక రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని రైతులు, గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బీటీ రోడ్లు వేస్తే పడమటగూడెంతో పాటు తూర్పుగూడెం వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులపై ఎమ్మెల్యే రాజయ్య, ఎంపీ పసునూరి దయాకర్ దృష్టికి తీసుకెళ్లా. నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

- మల్‌రెడ్డి పద్మ , సర్పంచ్, పడమటిగూడెం

పేదల పక్షపాతి సీఎం కేసీఆర్



చెక్కు అందజేస్తున్న రైతుబంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ రమణారెడ్డి

బచ్చన్నపేట: సీఎం కేసీఆర్ పేదల పక్షపాతి అని రైతుబంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఇర్రి రమణారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో పలు గ్రామాల లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాల హయాంలో పేదలకు పెద్ద జబ్బు చేస్తే పెద్దాస్పత్రుల్లో చికిత్స పొందే పరిస్థితి లేక చాలా మంది ఇబ్బందులు పడేవారని చెప్పారు. కానీ నేడు టీఆర్ఎస్ ప్రభుత్వం అందరికీ కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందే అవకాశం కల్పించిందని చెప్పారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బొడిగం చంద్రారెడ్డి, సర్పంచ్ వడ్డెపల్లి మల్లారెడ్డి, అంజయ్య, వేణుగోపాల్, సరోజన, సత్తయ్య, శ్రీధర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం చేయండి

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి క్షేత్రస్థాయిలో బీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు మాచర్ల గణేష్, ఛాగల్లు సర్పంచ్ పోగుల సారంగపాణి, క్లస్టర్ ఇన్‌చార్జ్ ఆకుల కుమార్ కోరారు. ఛాగల్లులో పార్టీ క్లస్టర్ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ప్రతీ 200 మంది ఓటర్లకు క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు బాధ్యత తీసుకుని ఇంటింటా తిరుగుతూ ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. ఇనుగాల నర్సింహారెడ్డి, నాగరబోయి శ్రీరాములు, కనకం గణేష్, రాఘవరెడ్డి, రజిత, కనకం రమేష్, ఆకుల నర్సింగం, పొన్న రాజేష్, కుమార్ పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

సాంస్కృతిక సంపదను కాపాడుకుందాం

- రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

దేవరుప్పుల: ఆధ్యాత్మికత, సాంస్కృతిక సంపదను కాపాడుకుందామని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మండల పరిధి కడవెండి శివారు శ్రీవానకొండయ్య లక్ష్మీనర్సింహస్వామి గుట్టపై రూ.1.60 కోట్ల వ్యయంతో చేపట్టే అభివృద్ధి పనులకు కలెక్టర్ శివలింగయ్యతో కలిసి శనివారం శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. బమ్మెర పోతన, పాల్కురికి సోమనాథుడి చరిత్రతతోపాటు సోమేశ్వర్‌స్వామి, శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఏటా జరిగే శ్రీవానకొండయ్య జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఘాట్‌రోడ్డు, కల్యాణ మంటపం, మెట్లపై నీడ కోసం రేకుల షెడ్ల ఏర్పాటుతోపాటు గుడి గోపురం పునరుద్ధరణ పనులు చేపడతామని చెప్పారు. ఈ సందర్భంగా మంత్రిని బీఆర్ఎస్ మండల కమిటీ, యూత్ సభ్యులు, ప్రజాప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీఓ మధుమోహన్, టూరిజం శాఖ ఎండీ మనోహర్, నిట్ రిటైర్డ్ ప్రొఫెసర్ పాండురంగారావు, ఎంపీపీ బస్వ సావిత్రి, సర్పంచ్‌లు బెల్లీనాలీనారెడ్డి, శంకర్, శ్రీనివాస్, బాలు, ఎంపీటీసీ కవితరత్నాకర్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి కల సాకారం చేస్తా..



దేవరుప్పుల: మంత్రి ఎర్రబెల్లిని సన్మానిస్తున్న బీఆర్ఎస్ మండల నాయకులు

కొడకండ్ల: చెన్నూరు రిజర్వాయర్ పనులు త్వరగా పూర్తి చేయించి రైతుల సాగునీటి కలను సాకారం చేస్తానని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శనివారం మండల పరిధి లక్ష్మక్కపల్లిలో మెయిన్ కెనాల్‌పై బ్రిడ్జి నిర్మాణానికి కలెక్టర్ శివలింగయ్యతో కలిసి శంకుస్థాపన చేసిన అనంతరం మంత్రి మాట్లాడారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని అన్నారు. ఇప్పటికే 85 గ్రామాల్లో సాగు నీరందించామని, మిగిలిన 30–35 గ్రామాల రైతులకు త్వరలోనే నీరందుతుందని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డీసీసీబీ వైస్ చైర్మన్ కుందూరు వెంకటేశ్వర్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ రాము, ఈజీఎస్ డైరెక్టర్ యాకయ్య, బీఆర్ఎస్ నాయకుడు సిందె రామోజీ, సర్పంచ్, ఎంపీటీసీలు శోభారాణి, రాంకోటి, వెంకటేశ్వర్‌రావు, మధుసూదన్, కృష్ణమూర్తి, ఉప్పలయ్య, పూల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్లంలో రాణిస్తే బంగారు భవిష్యత్

రఘునాథపల్లి: ఆంగ్లలో రాణిస్తే బంగారు భవిష్యత్ ఉంటుందని మండల నోడల్ అధికారి రఘునందన్ రెడ్డి అన్నారు. ఆంగ్లం భాష టీచర్స్ అసోసియేషన్ (ఎల్టా) ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో 8,9 తరగతి విద్యార్థులకు ఇంగ్లిష్ భాషపై పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రఘునందన్‌రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎల్టా మండల కన్వీనర్ వి. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి పోటీలు

తరిగొప్పుల: ఆంగ్ల భాషా టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్పెల్ విజార్డ్, స్టోరీ టెల్లింగ్‌లో మండల స్థాయి పోటీలను శనివారం మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీల్లో ప్రతిభకనభరచిన సుంకరి హర్ష, సరాల కీర్తన, పర్మణి, వైష్ణవి, చేవేళ్ల దివ్యలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం రామచందర్, మచ్చ చిరంజీవులు, అమర్‌నాథ్, కృష్ణతోపాటు తదితరులు పాల్గొన్నారు.



తరిగొప్పుల: బహుమతి అందజేస్తున్న రాంచందర్

ఆంగ్లంలో పట్టు సాధించాలి

బచ్చన్నపేట: ప్రతి విద్యార్థి ఆంగ్లంలో పట్టు సాధించాలని, అప్పుడే అన్ని రంగాల్లో రాణిస్తారని మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి అన్నారు. మండలంలోని హైస్కూల్ విద్యార్థులకు ఇంగ్లిష్ భాషలో ప్రావీణ్యంపై పరీక్ష నిర్వహించారు. సమీరా ప్రథమ స్థానంలో, కావ్య, అశ్విని ద్వితీయ స్థానాల్లో నిలిచారు. గెలుపొందిన విద్యార్థులకు మెమొంటోలతోపాటు ప్రశంస పత్రాలను అందించారు.

దాతల సహకారానికి సార్థకత చేకూర్చాలి



మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభిస్తున్న డీఐఈఓ

కొడకండ్ల: కళాశాలల్లో చదివే విద్యార్థులకు మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతో పాటు దాతలు మధ్యాహ్న భోజన సదుపాయం కల్పించడం అభినందనీయం.. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మంచి ఫలితాలతో దాతల సహకారానికి సార్థకత చేకూర్చాలని డీఐఈఓ బైరి శ్రీనివాస్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ పేరం రాము, ఈజీఎస్ డైరెక్టర్ యాకయ్య, సర్పంచ్ మధుసూదన్, మార్కెట్ డైరెక్టర్ అమరేందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ రమేష్, ప్రిన్సిపాల్ భార్గవరాజు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి సైనికుల్లా పనిచేయాలి



పాలకుర్తి టౌన్: మాట్లాడుతున్న జగన్మోహన్‌రెడ్డి



ఘన్‌పూర్ : సంజయ్ ప్రసంగాన్ని వీక్షిస్తున్న నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్/పాలకుర్తి టౌన్ : పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని బీజేపీ స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి నియోజకవర్గాల పరిశీలకులు వట్టిపల్లి శ్రీనివాస్‌గౌడ్, పడమటి జనగన్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డా, రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ వర్చువల్‌గా సమావేశం నిర్వహించగా.. నియోజకవర్గ కేంద్రాల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. అనంతరం నియోజకవర్గాల బాధ్యులు ప్రసంగించారు. పడమటి జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. పాలకుర్తి నియోజవర్గంలో దొరల పాలన నడుస్తోందని, బీజేపీ జైత్రయాత ఇక్కడి నుంచే ప్రారంభమవుతుందని చెప్పారు. వట్టిపల్లి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అవినీతి, నిరంకుశ పాలన సాగిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి, సీఎం కేసీఆర్‌కు తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు. పార్టీని బూత్‌స్థాయి నుంచి బలోపేతం చేయడంతోపాటు ప్రజా సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. ఆయా కార్యక్రమాల్లో పెద్దగాని సోమయ్య, పాకానటి దామోదర్‌రెడ్డి, లేగ రామ్మోహన్‌రెడ్డి, దొంగరి మహేందర్, ఐలోని అంజిరెడ్డి, వేముల అశోక్, ఇనుగాల యుగేందర్‌రెడ్డి, మాదాసు వెంకటేష్, బొజ్జపల్లి సుభాష్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా..



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రాజయ్య

జఫర్‌గఢ్: బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని, వారికి పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. శనివారం మండలంలోని కూనూర్‌కు చెందిన బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు 25 మంది హనుమకొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పార్టీలకతీతంగా చేస్తున్న గ్రామాల అభివృద్ధిని చూసి ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్ నెల్లుట్ల అజయ్, మండల కార్యదర్శి రాజు, సర్పంచ్ కుమార్, సురేష్, భాగ్యలక్ష్మి, సునీత, పాల్గొన్నారు.

దివంగత కవుల క్యాలెండర్ అందజేత



జనగామ రూరల్: జిల్లా కవులు, కళాకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రిటైర్డ్ ఆర్మీ డాక్టర్ కల్నల్ ఎం.భిక్షపతి సహకారంతో రూపొందించిన దివంగత కవుల క్యాలెండర్‌ను శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా గౌరీశంకర్ మాట్లాడుతూ వినూత్నమైన ఆలోచనలతో కవులు క్యాలెండర్‌ను ఆవిష్కరించడం గొప్ప విషయమని సంపాదకులను అభినందించారు. అకాడమీ చైర్మన్ సమోజు బాలచారి, కోటేశ్వర్‌రెడ్డి, కవులు జి.కృష్ణ , సోమేశ్వరాచారి, సోమనర్సింహచారి, సాయికిరణ్ ప్రభాకర్, మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



తెలంగాణ ఫార్మసిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నూతన సంవత్సరం క్యాలెండర్‌ను రాష్ట్ర కార్యదర్శి బత్తిని సుదర్శన్, డీఎంహెచ్ఓ మహేందర్ చేతుల మీదుగా కలెక్టర్ కార్యాలయంలో ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు కె.యాదగిరి, ప్రధాన కార్యదర్శి టి.ప్రభాకర్, జి.మమంత తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

జనగామ రూరల్: నానాటికి బాలికలు, మహిళలపై జరుగుతున్న దాడులు, అఘాయిత్యాల పట్ల విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని సఖి కౌన్సిలర్ రాధిక అన్నారు. శనివారం మండలంలోని గానుగుపహాడ్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు సోమయ్య అధ్యక్షతన చైల్డ్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సఖి సేవల పోస్టర్‌ను ఆవిష్కరించి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. బాలికలకు, మహిళలకు ఎల్లవేళలా సఖి అండగా ఉంటుందని 181 నంబర్‌కు ఫోన్ చేస్తే వెంటనే సేవలు అందిస్తుందని వివరించారు. కౌన్సిలర్ పవిత్ర, ఫ్రెండ్లీ టీచర్ బి.లలిత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలపై ఫిర్యాదు



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

కొడకండ్ల: నర్సింగాపురంలో డబుల్‌బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయని జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి సోమనర్సయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సురేష్‌నాయక్ శనివారం తహసీల్దార్ కోల చంద్రమోహన్‌కు ఫిర్యాదు చేశారు. లబ్ధిదారుల ఎంపికలో అర్హులకు కేటాయించకుండా అన్యాయం జరిగిందని, ఈ విషయంలో చర్య తీసుకొని అర్హులకు న్యాయం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవీందర్, మనోహర్, రంగయ్య, రమేష్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపూర్ చెరువు తూము పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..

రఘునాథపల్లి: మండలంలోని ఇబ్రహీంపూర్ పెద్ద చెరువు ‘తూముకు తుప్పు’ శీర్షికన శనివారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఇరిగేషన్ అధికారులు స్పందించారు. ఇరిగేషన్ ఏఈ గీత శనివారం ఆయకట్టు రైతులతో కలిసి తూమును పరిశీలించారు. తూము పైపులు, షెట్టర్ తుప్పు పట్టినట్లుగా గుర్తించారు. మూడేళ్ల క్రితం తూము లీకై నీరు వృథాగా బయటకు వెళ్తుండటంతో మూసి వేశామని, ఈ రబీ సీజన్‌లో సాగుకు నీళ్లు వదిలేందుకు ఎన్నిసార్లు ప్రయత్నించినా పైకి లేవడం లేదని ఆయకట్టు రైతులు ఏఈ వద్ద వాపోయారు. చెరువు నిండా నీళ్లు ఉండటంతో ఏటా మత్స్య సంపద కొల్పోతున్నామని తూము మరమ్మతు చేయాలని మత్స్యకారులు విజ్ఞప్తి చేశారు. తూము మరమ్మతు సమస్య ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలు తీసుకుంటామని ఏఈ పేర్కొన్నారు.



తూమును పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఏఈ గీత

నేడు జనగామ పట్టణంలో కరెంటు కోతలు

జనగామ: జనగామ పట్టణంలోని రెడ్డిస్ట్రీట్, కూరగాయల మార్కెట్, రైల్వేస్టేషన్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, గుండ్లగడ్డ కిష్టబావి ఏరియాలో నేడు (ఆదివారం) విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఎన్‌పీడీసీఎల్ ఏఈ శంకర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కూరగాయల మార్కెట్ ఏరియలో నూతన డీటీఆర్ అమర్చే క్రమంలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలన్నారు.

దుస్తుల పంపిణీ

జనగామ రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే విద్యార్థినులకు శనివారం వైట్ అండ్ వైట్ సంస్థ అధినేత గజ్జి మధు ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగా సందర్భంగా దుస్తులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఐఈఓ బైరి శ్రీనివాస్ హాజరై దుస్తులు అందజేశారు. సీడీసీ చైర్మన్ గట్టు వెంకటేశ్వర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

జనగామ రూరల్: ఈనెల 11న బెంగళూరులో నిర్వహించే మహాజన సోషలిస్టు పార్టీ, ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెస్పీ ఇన్‌చార్జ్ మంద కుమార్ పిలుపునిచ్చారు. శనివారం జనగామలోని విజయ ఫంక్షన్ హాల్‌లో జిల్లా ఇన్‌చార్జ్ ఇనుముల నర్సయ్య అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు జనాభా ప్రాతిపదికన విద్య, ఉద్యోగ, రాజకీయ, సంక్షేమ రంగాల్లో ప్రాతినిధ్యం కల్పించాలని అన్నారు. రాజశేఖర్, భాస్కర్, రవి, కిషోర్, అనిల్, నగేష్, ఏలియా పాల్గొన్నారు.

క్లుప్తంగా..

పరామర్శ

రఘునాథపల్లి: మాతృమూర్తిని కోల్పోయిన మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎం.యాదవరెడ్డిని పీసీసీ ఉపాధ్యక్షుడు దొమ్మాటి సాంబయ్య శనివారం పరామర్శించారు.

నివాళి

రఘునాథపల్లి: కోడూర్‌లో భవన నిర్మాణ రంగాల కార్మికుడు మునిగె వేణు (46) గుండె పోటుతో మృతి చెందాడు. కాగా, రాష్ట్ర భవన నిర్మాణ రంగాల సంఘం ప్రచార కార్యదర్శి రాసమల్ల కొమురయ్య సంఘం నాయకులతో కలిసి శనివారం కోడూర్‌లో మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

బియ్యం వితరణ

జఫర్‌ఘడ్: మండల కేంద్రంలోని వడ్డెగూడెంకు చెందిన దేవరాయ ఎల్లమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. శనివారం స్టేషన్ ఘన్‌పూర్ మాజీ మార్కెట్ చైర్మన్ అన్నెబోయిన భిక్షపతి, రాజేందర్ పరామర్శించి 50 కిలోల బియ్యం అందజేశారు.

ఆర్థికసాయం

చిల్పూరు: మండలంలోని చిన్నపెండ్యాలకు చెందిన ఆకుల కుమార్ ఇటీవల మృతి చెందాడు. కుమార్.. లక్ష్మీ పరపతి సంఘంలో సభ్యుడు కావడం శనివారం సంఘం అధ్యక్షుడు కరుణాకర్‌శర్మ, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు లింగారెడ్డి, ఎంపీటీసీ ఉమసమ్మయ్య రూ. 50 వేలు కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయంగా అందజేశారు.

బాధిత కుటుంబానికి..

కొడకండ్ల: విద్యుదాఘాతంతో మృతి చెందిన మండలకేంద్రానికి చెందిన గ్రామ పంచాయతీ వాటర్‌మెన్ సున్నపు శ్రీనివాస్ కుటుంబసభ్యులను శనివారం కాంగ్రెస్ నాయకులు పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు.

అండగా ఉంటాం..

కొడకండ్ల: పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు అండగా ఉంటామని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సిందె రామోజీ అన్నారు. శనివారం రామవరంలో ఇటీవల మృతి చెందిన ఎడెల్లి యాదగిరి కుటుంబసభ్యులకు దాతలు అందించిన రూ.11,500 నగదు, 50 కిలోల బియ్యాన్ని అందజేశారు.